


# మరో మజ్ను

**- మధుచక్రవర్తి**

"ఇది కలా... నిజమా!"

ఆరోసారి అరచెయ్యి గట్టిగా గిచ్చుకున్నాడు కబుర్ల కామేశం.

"అమ్మో . ."

"అయితే నిజమే! నిజంగా నిజమే!!"

తన వూహలరాణి— స్వప్నాల సుందరి — తన హృదయ సామ్రాజ్యానికి ఎలక్షన్లు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైన మహారాణి! తన రాణి . . తన రాగాలరాణి — మిస్ రాగరాణి . . తనకు . . ? లవ్ లెటర్!... రాయుటమా?!

వ్వాట్ ఏ పజిల్!

తనకు తెలియకుండానే — ఏ తపస్సూ గట్రా చెయ్యకుండానే—

ఏ వూసుపోని దేవుడన్నా వరమిచ్చేశాడా?

తన పర్సనాలిటీ అంత బావుంటుందా!?

వెధవ అద్దం మార్పించాలి.

మరి— రాజుగాడు తన్ను "బక్క సన్నాసీ— డొక్కు సన్నాసీ." ఇత్యాది బిరుదు వాక్యాలతో సంబోధిస్తాడేం?

వెధవ బాడీ బిల్డింగూ— వెధవకండలూ వాడూను.

తను అంత బక్కగా ఉన్నాడా?

జస్ట్ స్లిమ్ — జస్ట్ లైక్ అమితాబ్. అంతే!

వెధవ వాడికేం తెలుసు... ఒళ్ళు పెంచటం తప్ప.

ఒక గర్ల్ ఫ్రెండా, పాడా . . .

'నా రాణి ఎంత అందంగా రాసింది ఉత్తరం! ముత్యాలు పేర్చినట్టు లేవూ ఆ అక్షరాలు...' పదోసారి మళ్ళీ విప్పాడు ఉత్తరాన్ని.

ఇంటిమేట్ గుప్పుమంది.

"డియర్ కామేష్..."

( అబ్బ — నా పేరు కెంతందమొచ్చింది! కామేష్ ష్...ష్... ఆహా: — వెధవ రాజుగాడూ పిలుస్తాడు —కామిగా . . .కామిగా అంటూ).

—"క్లాసులో నువ్వేసే జోక్స్ నన్నెంత నవ్విస్తాయో చెప్పలేను. నవ్వుకుంటాను. ఎప్పుడూ నవ్వుతూ — అందర్నీ నవ్విస్తుంటావ్. నిజంగా నువెంత అదృష్టవంతుడివి కామేష్..."


( అబ్బ — నా రాణి నన్నెంత పొగిడేస్తోంది. నా జోక్స్ బావుంటాయుట! అసలు నేను జోక్స్ వేసేది తన కోసమేనని తెలియదేమో!

నిద్రలో కూడా నవ్వుకుంటుందట! అంటే... అంటే నేను కలల్లోకి కూడా వస్తానన్నమాట! అమ్మో—అమ్మో— ఎంత అదృష్టం! ఇంతకాలం ఎక్కడ దాక్కుం దీ అదృష్టమంతా! నేను నిజంగా అదృష్టవంతున్నే! నీ లాంటి అందాలరాశి అనెక్స్పెక్టెడ్‌గా నాపై లవ్ ప్రకటిస్తే నేను అదృష్టవంతుణ్ణి కాకపోతే మరెవణ్ణి? )

—"కామేష్ . . . ఎప్పటి నుంచో నీ కో విషయం చెప్పాలనుకుంటున్నాను. కానీ స్త్రీ సహజమైన సిగ్గుతో — నువ్వేమను కుంటావో నన్న బిడియంతో ఇంతవరకూ చెప్పడానికి సంకోచించాను. కానీ ఎంతకాలం నా మనసుకు ముసుగు వేయను? ఇంకెంతకాలం ఈ గుండెకు గడియ వేయను?—"

( నా రాణీ — నువ్వేమైనా చెబితే నే నేమన్నా అనుకుంటానా? ఎంత పొరబడ్డావ్! ఎంత అపార్థం చేసుకున్నావ్! నా మనసు కల్తీలేని వెన్నలాంటిదని నీకు తెలియదా? )

—"ఒకోసారి, మీ రూమ్‌కి వచ్చి మనసువిప్పి చెప్పెయ్యాలనిపిస్తుంది. కానీ — ఆయన...ఆయన ఏమనుకుంటారో నన్న భయంతో రావడం మానేసే దాన్ని. ఆ ప్రయత్నం మానుకునేదాన్ని..."




( రూముక్కూడా వద్దామనుకున్నావా, ప్రియతమా! నీ కోసం మా రూమ్ తలుపులెప్పుడూ తెరిచే ఉంటాయనీ — అసలు మా రూమ్‌కి తలుపులే లేవనీ నీకు తెలియదా, దేవీ! రాజుగాడు ఏదో అనుకుంటాడని భయపడ్డావా? వెధవ వాడేమనుకుంటాడు? అయినా వాడికి మనని పట్టించుకునే తీరికెక్కడిది? ఎప్పుడూ కసరత్తులూ— కుస్తీపట్లూ తప్పితే).

"కానీ— కామేష్ — ఈ హృదయవేదన ఇక భరించలేను. అది నా గుండెని నిలువునా కాల్చేస్తూంది. ఒకోసారి చచ్చిపోదామనిపిస్తుంది. కానీ, చావని కోరిక నన్ను చావనీయడం లేదు. నా ఆశలన్నీ నీ మీదే పెట్టుకున్నాను. నాకు నీ మీద పూర్తి నమ్మకముంది—నా మనోవాంఛ తీరుస్తావని. అందుకే ఇంత ధైర్యం చేసి ఈ ఉత్తరం రాస్తున్నాను. నన్నపార్థం చేసుకోవు కదూ— కామేష్ — అక్షరాలలో నా మనోభావాల్ని వ్యక్తం చేయలేక పోతున్నాను. అందుకే నీ సమక్షంలో మనసు విప్పి మాట్లాడాలనీ, నీకు నా హృదయ ఘోష వినిపించాలనీ ఉంది. ఈ రోజు సాయంత్రం అయిదు గంటలకు మున్సిపల్ పార్కులో, రాధా మాధవుల విగ్రహం దగ్గర నీ కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తుంటాను. నా మాట మన్నించి తప్పకుండా వస్తావు కదూ—

రాణి."

( నా రాణీ — నా దేవీ — గుండెని మొహమాటం లేకుండా కాల్చేసే బాధను నువ్వొక్కతివే భరిస్తున్నావా? పిచ్చిదాన — ఈ మాత్రం దానికే చచ్చిపోదామనుకుంటున్నావా? అమ్మో — నీకేమన్నా అయితే నేను భరించగలనా? బతగ్గలనా? నేనూ ఏ విషమో తిని చచ్చిపోనూ. ( ఏమో ఈ కల్తీ విషాల్ని నమ్మలేం. ) నిన్ను అపార్థం చేసుకుంటానా, రాణీ . . . నా జీవితానికే అర్థం నువ్వు కదా! (అబ్బ — ఎంత గంభీరమైన డైలాగు! ) మన పవిత్రప్రేమను కల్తీలేని రాధా మాధవుల ప్రేమతో పోల్చావా, దేవీ! అబ్బ! ఏం సింబాలిజమ్! నా కోసం నువ్వు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తుంటావా, రాణీ — చంద్రుని కోసం కలువలా— సూర్యుణ్ణి కోరే కమలంలా —ఆహా — ఎన్ని జన్మల అదృష్టం హోల్‌సేల్‌గా వచ్చి నన్ను వరించిందో! )

అమర ప్రేమికుడిలా అతి గాఢంగా, బరువుగా నిట్టూర్చి, ఉత్తరాన్ని అతి జాగ్రత్తగా మడిచాడు.

"ఒరేయ్ కామిగా! బుల్ వర్కర్ వచ్చేసిందిరా" అంటూ బుల్ వర్కర్‌ని పట్టుకొని బుల్‌లా దూసుకొచ్చిన రాజా — గంభీరంగా సీలింగ్ చూస్తూ నిలుచుండిపోయిన కామేశాన్ని చూసి, "అదేంట్రా బక్క సన్నాసీ! అలా బిగుసుకుపోతున్నావ్? ఏమైందేంటీ? " రాజా మాటలకి ఈ లోకంలోకి వచ్చి—

"ఒరేయ్! బక్క సన్నాసీ— గిక్క సన్నాసీ అన్నావంటే మక్కెలిరగ తంతాను జాగర్త ఆ..." అన్నాడు కామేశం, ఏ అల్లా ఉద్దీన్ అద్భుత దీపమో తన దగ్గర ఉన్నంత దీమాగా. మొదట కామేశం మాటలకి ఆశ్చర్యపోయి, తరవాత ఒకసారి తేరిపార చూశాక, "హ హ్హా — ఏంటీ! నువ్వు నాకు మక్కెలిరగ తన్నేవాడివా?" అంటూ కామేశం మెళ్ళ మీద ఒక్కటి చరిచాడు రాజా. ఆ దెబ్బతో బోర్ల పడబోయి, ఎలాగో నిలదొక్కుకుని, పరిస్థితి విషమిస్తూంది. , ఇక లాభం లేదని—

"అద్సరే గానీ, ఆ బుల్ వర్కర్ వల్ల లాభం ఏమన్నా ఉందా?" అంటూ టాపిక్ మార్చాడు.

"లాభం ఉందో, లేదో నీ కెందుకురా, డొక్కు సన్నాసీ — నువ్వేమన్నా చెయ్యాలా, పెట్టాలా" అన్నాడు రాజా.

మళ్ళీ డొక్కు సన్నాసీ అనే సరికి, చిర్రెత్తింది కామేశానికి. అయినా, శారీరకంగా రాజా ఆధిక్యానికి తల ఒగ్గక తప్పింది కాదు కామేశానికి. ఇక వాడితో లాభం లేదనుకుని, ఒక కునుకు తీస్తే కాస్త బుగ్గలున్నా పొంగుతాయనీ, "ఒరేయ్ రాజా! నన్ను నాలుగ్గంటలకి లేపరా, కాస్త బయట కెళ్ళే పనుంది" అంటూ మంచమెక్కాడు.

"ఏరా ? ఏ కాలేజీ బ్యూటీ కన్నా అపాయింట్‌మెంట్ ఇచ్చావా!" పేర్సిల్ విప్పి, ఇన్‌స్ట్రక్షన్స్ కాగితం చూస్తూ అన్నాడు రాజా.

దుప్పటి ముసుగు తప్పించి, "అదంతా సస్పెన్స్. రాత్రికి నీ కో శుభవార్త చెబుతాన్లే!" అంటూ ముసుగుతున్నాడు కామేశం. ముసుగు తన్నిన కామేశాన్ని చూసి, ముసిముసిగా నవ్వుకుంటూ మళ్ళీ ఇన్‌స్ట్రక్షన్స్ చదవడంలో మునిగిపోయాడు కామేశం.

● ● ● ●

కారు హార్న్ చప్పుడయ్యేసరికి ఉలికి పడి చూశాడు కామేశం. పార్కు గేట్ ముందు కారాగింది. నీరెండ కాంతిలో నిగనిగా మెరిసిపోతూంది సరి కొత్త నీలి రంగు అంబాసిడర్. కారు లాక్‌చేసి, గేటులోంచి లోపలికి వస్తూంది రాణి. ఎడమచేతికి వానిటీ బాగ్ తగిలించుకుని, కుడిచేతి వేళ్ళతో కారు తాళాన్ని విలాసంగా కదిలిస్తూ ఒయ్యారంగా, హుందాగా నడిచి వస్తూంది రాణి.

గులాబీ రంగు షిఫాన్ శారీ ఒంటికి అతికి పోయినట్టుగా ఉంది. ఆ పైట చాటున ఒంపులు తిరిగిన ఆరెంజ్ రంగు జాకెట్టు బిడియంగా దాగుంది. తలంటుకున్నట్టుంది—నల్లని కేశాలు పిరుగాలితో సరాచికాలాడుతూ, అద్దం లాంటి చెక్కిళ్ళను అప్పుడప్పుడు ముద్దు పెట్టుకుంటున్నాయి.

ఆ అందాలరాశి తన సొంతం కాబోతుందనే వూహ స్ఫురించే సరికి నరాలన్నీ పులకింతతో ఒక్కసారి బృందగానం ఆలపించాయి కామేశానికి.

దూరంగా రాధా మాధవుల విగ్రహం దగ్గర సిమెంట్ బెంచీపై, ఎడమకాలు బార్లా చాపి, కుడి కాలు విల్లులా వంచి వెనక్కి వారబడి కూర్చున్న కామేశాన్ని చూడగానే, సిగ్గుతో బరువైన తల కిందకు వాలిపోయింది రాణికి.

కామేశం లేచి నిలబడ్డాడు.

రాణి దగ్గరవుతున్న కొద్దీ అతని గుండె బరువైపోతోంది.

తొలి ప్రేమికుల కలయిక అని కాబోలు వాతావరణం చాలా గంభీరంగా, నిశ్శబ్దంగా ఉంది.

"థాంక్స్."

ఉలికిపడి చూశాడు. ఎదురుగా అరమోడ్పు కనులతో అధోముఖియైన అందాల రాశి రాణి!

"డోంట్ మెన్షన్" అన్నాడు అదేదో సినిమాలోని నాగేశ్వరరావుని వీలైనంతగా ఇమిటేట్ చేస్తూ.

కాస్త ధైర్యాన్ని పుంజుకుని, "థాంక్స్ దేనికి?" అడిగాడు.

"నా మాట మన్నించి వచ్చినందుకు." తలెత్తకుండానే సమాధానమిచ్చింది రాణి.

"దేవతల ఆజ్ఞను పూజారి మన్నించడమా? శిరసావహించాలి గాని...', మళ్ళీ నాగేశ్వరరావ్‌గార్నే అనుకరించాడు కామేశం.

ఆ మాటలకు తలెత్తి సూటిగా అతని కళ్ళల్లోకి చూడలేక సిగ్గుతో తలవాల్చేస్తూ—"దేవత దేవుణ్ణి ఆజ్ఞాపిస్తుందా? అర్థిస్తుంది గాని..." ఆమె గారు వాణిశ్రీ కేం తీసిపోలేదు.

"రాణీ!" తనకే వినిపించనంత మెల్లగా అంటూ కాదు — గొణుగుతూ అప్రయత్నంగా, ఊహుఁ ప్రయత్నంగా కామేశం రెండు చేతులతో రాణి గుండ్రటి నున్నని భుజాల్ని చుట్టేసి, గుండెకి హత్తుకున్నాడు.

"అబ్బ . . .ఆ . . .వ్వా . . . కామేష్ . . ష్ . . . ష్ . ." పారవశ్యంలో మత్తుగా మూలిగింది రాణి.

దూరంగా ఆంజనేయస్వామి గుడిలో గంటలు— గణగణా... గణగణా...

దబదబా . . .దబదబా . . . వీపు మీద బాదే సరికి తుళ్ళిపడి లేచాడు కామేశం.

రాణి లేదు... గుడిగంటలూ లేవు.

ఎదురుగా జీవన్‌టోన్ వాడిన తరవాత బొమ్మలోని మనిషిలా, రాజా మాత్రం నిలుచున్నాడు.

జరిగినదంతా కలని తెలిసే సరికి, అయిదు రోజులు ఉపవాసం చేసినట్టు ఉస్సురంటూ నీరసించి పోయాడు కామేశం.

"ఏరా! ఎక్కడికో వెళ్ళాలన్నావ్, ఏదో శుభవార్తన్నావ్! ఏం అంతా కాన్సిలా?" రాజా మాటలకి నీరసాన్నించి కాస్తంత తేరుకుని, "కాన్సిల్ కాదురా, సన్నాసీ! కమెన్సౌతుంది' అంటూ ఒక్క ఉదుటున మంచం మీంచి గెంతి, గబగబ ఒక బకెట్ నీళ్ళు మీద ఒంపుకుని స్నానమొందనిపించి, తలదువ్వుట అనే బృహత్ కార్యానికి ఉపక్రమించాడు కామేశం.


కానీ తల వెంట్రుకలు విప్లవవీరుల్లా, గెరిల్లాల్లా స్వాతంత్ర్యం ప్రకటించాయి. చవట దద్దమ్మల్లా మేం తలలొంచం, తిరుగుబాటు చేస్తాం, ధైర్యంగా టీవిగా నిలుచుంటాం అన్నట్లు నిటారుగా నిక్కబొడిచాయ్.

కామేశానికి అరి కాలు మంటెక్కింది. కానీ చేసేది లేక, దాన్నే దిలీప్‌కుమార్ హెయిర్ స్టయిల్ గా సరిపెట్టుకుని, వస్త్రధారణకు ఉపక్రమించాడు.

పాత ట్రంకుపెట్టె తెరిచే సరికి కిర్రుమంది. కిముక్కున వచ్చినట్టు లోపల, ఒంటరినై పోయాను అంటూ విషాదగీతాన్ని ఆలపిస్తున్నట్టుంది, తన అసలు రంగు కోల్పోయి, ఫలాని అని పేరు తెలీని రంగు దాల్చిన మచ్చల చొక్కా.

రాణి తొలిసారి ప్రేమ పిలుపుకు ఇలాంటి చొక్కా వేసుకెళ్ళడమా? ఏడుపొచ్చినంత పనైంది కామేశానికి. నెత్తి బాదుకున్నాడు, జుత్తు పీక్కుందామనుకున్నాడు గానీ, ఏదో గుర్తొచ్చి ఆ పని మానుకున్నాడు.

పోనీ, రాజా బట్టలేసుకుందామా అంటే —



ఫోటో: కె. జి. నటేశన్

వాడవలే డబుల్ పన్నాగాడు. వెధవ బాడీ బిల్డింగూ —వెధవ కండలూ వాడూను. ఇక, వాడి బట్ట లేసుకుంటే — ఆహా — ఇహ వేరే చెప్పాలా— ఈ జాత్తుకి, ఆ బట్టలకీ, పిచ్చోడని వంతులువారీ తంతా రంతా. ఆ క్షణంలో రాజా మీద చెప్ప లేనంత కోపమొచ్చింది కామేశానికి— తన కన్న లావుగా ఉన్నందుకు. తన మీద కూడా వచ్చింది— రాజా కన్నా సన్నగా ఉన్నందుకు.

ఏ గతీ లేకపోతే — చివరికేదో గతన్నట్టు, అప్పటికే వారం రోజులుగా వేస్తున్న ఒక పాత పాంటును, శుభ్రంగా అయిదుసార్లు దులిపి ఆరోసారి వేసుకున్నాడు. ముచ్చటగా ఆ మచ్చల చొక్కానే వేద్దామని పెట్లోంచి పైకి తీశాడు.

తొలిరేయి మగని తొలి స్పర్శకు పులకించి, సిగ్గుతో మొగ్గలా ముడుచుకుపోయిన నవవధువులా ఉంది, ఇస్త్రీ లేక నలిగిపోయిన మచ్చల చొక్కా. అప్పటికప్పుడే దాన్ని అరచేతి ఇస్త్రీ చేసి వేసుకున్నాడు కామేశం. కామేశం చర్యల్ని గమనిస్తున్న రాజా తనలో తనే నవ్వుకున్నాడు.

ఒకసారి ఎగాదిగా చూసుకుని, "ఒరెయ్! ఖార్టికి నువ్వే వంటచెయ్. నే నొచ్చేటప్పటికి కొంచెం ఆలస్యం కావచ్చు" (ఏమో రాణి ఏదన్నా సినిమా ప్రోగ్రాం వేసిందేమో) అని రాజాతో అనేసి రూములోం వూడిపడ్డాడు కామేశం. కామేశం హడావుడిని చూస్తూ నవ్వుతూ అలానే ఉండిపోయాడు రాజా.

● ● ● ●

రోజూ చూస్తున్న పార్కే అయినా, ఆ రోజేదో కొత్తగా, వింతంగా, ఎంతో అందంగా కనిపించింది కామేశానికి. గట్టిగా వూపిరి పీల్చి, ఛాతీ పొంగించి ఫస్ట్ సీన్లో మొట్టమొదటిసారి కనిపించే తెలుగు హీరోలా గంభీరంగా లోపలికి నడిచాడు.

"ప్రేమకోసమై వలలో పడనే పాపం పసి వాడు..." అరిగిపోయిన పాత రికార్డును అందరికీ వినిపిస్తూంది పార్కులో హారన్.

పార్కులోని అణువణువు ఏదో కొత్త అందాలను పుణికి పుచ్చుకున్నట్టు కనిపించాయి కామేశానికి.

శిథిలావస్థలో ఉన్న సిమెంటు బెంచీలు శిల్ప కళా నైపుణ్యంతో నిండిన పాలరాతి సింహాసనాల్లా అగుపించాయి. ఎలక్ట్రిక్ స్తంభం మీది మాలకాకి అరుపులు వసంత ఋతువులలో గున్నమావి చిగురులు మేసి, మత్తెక్కి, మత్తుగా — మెత్తగా కూసే కోయిలకూతలలా హాయిగా, ఆహ్లాదంగా వినిపించాయి.

మెల్లగా రాధామాధవుల విగ్రహం దగ్గర కొచ్చాడు కామేశం. మచ్చల చొక్కా కామేశాన్ని చూడ్డంతోనే అతి గౌరవంగా, భయంగా సిమెంటు బెంచీపై నుంచి చెంగున కిందకు దూకి, తోక ముడుచుకుంటూ పరుగెత్తింది మచ్చల సజ్జి కుక్క.

కుక్క కూర్చున్న బెంచీపై కూర్చోడానికి ఒకింత సంశయించి. బెంచీకి వెనుక ఒక అంద




మైన భంగిమలో వొరబడి నిల్చుని రాధా కృష్ణుల విగ్రహం కేసి చూడసాగాడు. తను కృష్ణుడు, రాణి....రాధ. ఆ విగ్రహం కింద చుట్టూ ఉన్న చిన్న కొలనులాంటి దానిలో నీళ్ళు—ఆ విగ్రహం కట్టినప్పుడో ఆ పార్కు ప్రారంభోత్సవం నాడో పోసినట్టున్నాయి. రకరకాల నాచు మొక్కలతో పచ్చగా కలకల్లాడుతూంది.

కామేశం వచ్చిన అలికిడికి అక్కడ గట్టుమీదున్న కప్పలు స్విమ్మింగ్‌పూల్లో గెంతే నీగ్రోల్లా తపతప మని నీట్లోకి గెంతాయి. మానస సరోవరంలా, యమునాతీరంలా కనిపించిందని కామేశానికి.

ఆ మానస సరోవరం మీదుగా వీస్తున్న మలయ పవనాలు ముక్కుపుటాలను బద్దలగొడుతున్నా రాణి గురించి ఏకాగ్రతగా ఆలోచిస్తూ నిలుచున్నాడు కామేశం.

రాణి వస్తే — వచ్చి, తన చేతిని తన మెత్తని చేతిలోకి తీసుకుని లాలనగా, ప్రేమగా నిమురుతూ పారవశ్యంలో మత్తుగా "ఐ లవ్యూ కామేష్" అంటే... అమ్మో... తను పరవశించిపోడూ — పులకించిపోడూ! రాణి అంటూ తన హృదయానికి మెత్తగా హత్తుకోడూ? అప్పుడు దూరంగా గుడిలో గంటలు గణగణా మోగవూ— అబ్బ! ఎంత తీయని ఆలోచన!

కారు హార్న్ మోగే సరికి ఉలికిపడి గేటువైపు చూశాడు.

రాణియే! తన రాణియే — నడిచివస్తూంది తన వైపే. అమ్మో ఎంత అందంగా మెరిసి పోతూందో తన ప్రేయసి! చటుక్కున పక్కనే ఉన్న కొబ్బరి ఆకును చిదిమి ఒక చిన్న ముక్క నోట్లో పెట్టుకుని, అదే పనిగా నములుతూ అచ్చం సినిమా హీరోలా నిల్చున్నాడు కామేశం.

ఎప్పుడూ చూసే రాణియే అయినా, ఆ సమయంలో రాణిని తలచుకుంటుంటే, ఒళ్ళంతా కిత కితలు పెట్టినట్టు ఒకటే గగుర్పాటు.

తలెత్తి రాణిని చూడ్డానికి ధైర్యం చాలడం లేదు కామేశానికి.

"వెరీ మనీ థాంక్స్... నా మాట మన్నించి వచ్చినందుకు." ఉలికిపడి చూశాడు కామేశం.



ఎదురుగా టూత్‌పేస్ట్ అడ్వర్టైజ్‌మెంట్ బొమ్మలా నవ్వుతూ రాణి!

"రాకపోతే రాణి గారికి ఆగ్రహం రాదూ!"

తన మాటలకి తనే పులకించిపోయాడు కామేశం.

"నువ్వొస్తున్నట్టు ఆయనకి తెలుసా, కామేష్..."

"ఎవరికీ? ఓహో — రాజా గాడికా. చ. చ. వాడికి తెలియనిస్తానా? నా కా మాత్రం తెలీదూ?"

"నన్నపార్థం చేసుకోవు కదూ, కామేష్..."

"చ . . .చ . . .నిన్ను... నేను... అపార్థం!.. చేసుకోడమా? నన్నెంత అపార్థం చేసుకున్నావు, రాణి."

"చూడు, కామేష్! ఆడది తనకు తాను ప్రేమిస్తున్నానని ఏ మగాడితోనైనా చెప్ప గలదా?"

"నీ బాధ అర్థం చేసుకున్నాను, రాణీ!"

కామేశానికంతా కలలా — కలర్‌ఫుల్ సీన్లా ఉంది. బెంగాలీ పాప లాంటి, బంగారు తీగలాంటి అమ్మాయి తనకు తానుగా —

"నిన్ను ప్రేమిస్తున్నాను. నా ప్రేమను స్వీకరించవా ప్రియా..." అని అంటే... అంటుంటే ఏ మగాడికైనా ఎలా ఉంటుంది? కామేశానికి మాత్రం రేసు కుక్కలా పరిగెత్తాలనీ — పిచ్చి కుక్కలా అరవాలనీ ఉంది.

"థాంక్స్, కామేష్! ఆ నమ్మకంతోనే, ఆ ధైర్యంతోనే ఈరోజు నిన్నిక్కడకు రమ్మన్నాను— నా మనసు విప్పాలనీ, విప్పి చెప్పాలనీ."

"అబ్బా — ఈ డైలాగ్స్ చెప్పి పిచ్చెక్కించే బదులు ఐ లవ్యూ కామేష్... అంటూ హత్తుకు పోకూడదూ..." కామేశానికి వున్న జ్వర మొచ్చి నట్టుంది.

"తొలి చూపులోనే మనసు అర్పించాను. పగలు, రాత్రి ఇంట్లోను — ఆ దేవుడికి ఎప్పుడూ నాపై దయ కలుగుతుందా, ఎప్పుడు నా ప్రేమ ఫలిస్తుందా...అని, ఇంతవరకూ ఎదురు చూశాను. కానీ — అప్పుడప్పుడు ఆశలు అడియాస లవుతాయేమోనన్న అనుమానం తలెత్తుతూంది. మళ్ళీ, నీ ముఖంలోకి చూస్తే.

నా ప్రేమ ఫలిస్తుందన్న ఆశ చిగురిస్తూంది. నువు నన్ను పూర్తిగా అర్థం చేసుకున్నావన్న నమ్మకం నాక్కలిగింది.

నువ్వెలాగైనా ఆయనకి మనసు . . నా మనోవేదన, ఆయన హృదయంలో నాకు స్థానం కలిగించు. మమ్మల్ని ఒకటి చెయ్యి నా ప్రేమ విజం చెయ్—ఇదిగో ఈ ఉత్తరం ఆయన కివ్వు..." అంటూ ఒక నీలిరంగు కవరు అందించింది.

ఇంటిమేట్ గుప్పుమంది.

అయోమయంతో మెదడు మొద్దు బారిన కామేశానికి, ఆ రంగూ... వాసనా తెలిసేను అయోమయంగానే కవరు అందుకుని చూశాడు.

"ప్రియమైన రాజాకి ప్రేమతో—" అన్న ముత్యాల్లాంటి అక్షరాలు మాత్రం భూతద్దం లోంచి కనిపించినట్టు, భూతాల్లా అగుపించాయ్.

★